సమన్వయంతోనే అభివృద్ధి పథం

- సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మండల అభివృద్ధికి సహకరించాలి
- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- రూ.70లక్షలతో తెనాలి మండలంలో పలు అభివృద్ధి పనులకు తీర్మానం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిటౌన్: మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సహకరించాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సూచించారు. రూ.70లక్షలతో మండలంలో చేపట్టబోయే వివిధ అభివృద్ధి పనులకు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. మండల పరిషత్ అధ్యక్షుడిగా ధర్మరాజుల చెన్నకేశవులు ఎన్నికైన తొలి సమావేశం కొత్తపేటలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగింది. సమావేశానికి ఎంపీపీ చెన్నకేశవులు అధ్యక్షత వహించారు. సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ జనవరి ఒకటి నుంచి ఫిబ్రవరి 14 వరకు సంక్షేమ పథకాల ద్వారా రూ.30వేల కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయడానికి ముఖ్యమంత్రి బటన్ నొక్కనున్నారని తెలిపారు. జనవరిలో జరిగే కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. ప్రస్తుతం జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు సూచించారు. జనవరి 19న విజయవాడలో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ఉపయోగించుకునే విధంగా ప్రజలను చైతన్యవంతులను చేయాలని తెలిపారు. నియోజకవర్గంలో 27వేల మందికి ఇళ్లస్థలాలు పంపిణీ చేశామని చెప్పారు. సమావేశానికి మండల స్థాయి అధికారులందరూ వచ్చేవిధంగా చూడాలని, సమావేశంలో సభ్యులు లేవనెత్తిన అంశాలను అధికారులు నమోదు చేసుకోవాలని, ఆ సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశానికి రాని అధికారులకు నోటీసులు అందజేసి తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఓటీఎస్ ద్వారా హౌసింగ్ శాఖకు ఇంటి డాక్యుమెంట్ కోసం నగదు చెల్లించామని, ఇంతవరకు హౌసింగ్ అధికారులు డాక్యుమెంట్ ఇవ్వలేదని నందివెలుగు గ్రామ సర్పంచ్ ధూళిపాళ్ల పవన్‌కుమార్ సమావేశంలో తెలిపారు. దీనిపై హౌసింగ్ అధికారులతో మాట్లాడి డాక్యుమెంట్స్ ఇప్పించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. విద్యుత్ ఏఈ వసంతరావు మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామాల్లో విద్యుత్ కొరత లేదని, జగనన్న లే అవుట్‌లలో ఉచితంగా విద్యుత్ కనెక్షన్‌లు అందిస్తున్నామని చెప్పారు. వ్యవసాయానికి విద్యుత్ కనెక్షన్‌లు వెంటనే ఇస్తున్నామని, రైతులు ఉపయోగించుకోవాలని కోరారు. హౌసింగ్ ఏఈ శ్రీనివాస్ మాట్లాడుతూ నియోజకవర్గంలో 8 లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయని, వెలుగు అధికారుల ద్వారా బ్యాంకు నుంచి ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఇంటి నిర్మాణం చేపట్టే లబ్ధిదారులను చైతన్యం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ వి.ప్రతాప్‌రెడ్డి, ఎంఈఓ మేకల లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ జి.సుభాష్‌చంద్రబోస్, కొలకలూరు పశువైద్యాధికారి డాక్టర్ మీనాక్షి, ఇరిగేషన్ ఏఈ విద్యావతి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం

తెనాలిఅర్బన్: తెనాలి మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు తెలిపారు. ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో జరిగే సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన వహిస్తారు. అలాగే 11.45 గంటలకు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనున్నట్లు వివరించారు. 2023–24 సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ అంచనాలు సమావేశంలో ఆమోదించనున్నట్లు తెలిపారు. సమావేశంలో కౌన్సిలర్‌లు, కో–ఆప్షన్ సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులు పాల్గొనాలని కోరారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ



తెనాలిఅర్బన్: శ్యామ్ అండ్ జెన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చెంచుపేటలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ అలెగ్జాండర్ మాట్లాడుతూ ఎయిడ్స్, టీబీ రోగులకు అవసరమైన మందులను కూడా ప్రతి నెల పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఎస్.రమేష్, సభ్యులు పాల్గొన్నారు.

త్రీటౌన్ ఎస్ఐ బాధ్యతల స్వీకరణ



తెనాలిరూరల్: తెనాలి త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా నక్కా ప్రకాశరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. 2010 బ్యాచ్‌కు చెందిన ఆయన పల్నాడులో వివిధ ప్రాంతాల్లో పని చేశారు. ప్రస్తుతం గుంటూరు రూరల్ ఎస్ఐగా పనిచేస్తూ తెనాలి త్రీ టౌన్‌కు బదిలీపై వచ్చారు. త్రీ టౌన్ సీఐ ఎస్.రమేష్ బాబును కలిసి రిపోర్ట్ చేశారు. ప్రజలతో మమేకమై శాంతిభద్రతలను కాపాడడమే తన లక్ష్యంగా ఎస్ఐ చెప్పారు.

మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ



తెనాలిటౌన్: పట్టణ రైల్వేస్టేషన్ వద్ద బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భవానీ మాల ధరించిన వారికి గురువారం మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. గురువు దేశబోయిన పున్నారావు సత్యవతి దంపతుల ఆధ్వర్యంలో 250మంది భవానీలు, అయ్యప్ప మాలలు ధరించారని తెలిపారు. గత 20 సంవత్సరాల నుంచి పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పట్టణ బీసీ సంక్షేమ నాయకులు ఆరాధ్యుల శివ యాదవ్, తాడిబోయిన శంకరరావు, దేశబోయిన ప్రసాద్, శ్రీనివాస్, కృష్ణవేణి, కల్పన, రేవతి, వనజ, సత్యవతి, రంగయ్య పాల్గొన్నారు.

చెత్త సేకరణకు ప్రత్యేక ఏర్పాట్లు

మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ హెలెన్ నిర్మల



తెనాలిఅర్బన్: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సమ్మె నేపథ్యంలో పట్టణంలోని చెత్తను తొలగించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల గురువారం తెలిపారు. కార్మికులు మూడు రోజుల నుంచి సమ్మెలోకి వెళ్లిన నేపథ్యంలో ప్రత్యేక సిబ్బంది ద్వారా చెత్త సేకరణ చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేశామన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఆయా వార్డుల్లో పర్యటిస్తూ దీనిని నిత్యం పర్యవేక్షిస్తున్నారని చెప్పారు.

పేకాట శిబిరంపై దాడి



తెనాలిరూరల్: పేకాట శిబిరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. తెనాలి మండలం జగ్గడిగుంటపాలెం గ్యాస్ గోడౌన్ వెనుక కోతముక్క ఆడుతున్నారన్న సమాచారంతో రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు తమ సిబ్బందితో గురువారం రాత్రి ఆకస్మిక దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.3200, నాలుగు సెల్‌ఫోన్‌లు స్వాధీనపరుచుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చీకటి బతుకులకు తోవ 'మిణుగురులు'

- ఆధునిక కాలంలో తొలి దళిత కవయిత్రి
- ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి పరిశోధనాత్మక రచన
- రేపు తెనాలిలో చర్చావేదిక సందర్భంగా...


ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి

తెనాలి: 'ఈ మిణుగురులు/ నవ్వే గాయాలు/ పిడికెడు మనిషితనం కోసం/ యుద్ధరంగమైన వాళ్లు/ ఇనప చట్రాలను ఛేదించిన ధిక్కార కేతనాలు'...ప్రముఖ రచయిత్రి ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి తాజా పుస్తకం 'మిణుగురులు' సంక్షిప్తమిది. సంక్షుభితమైన జీవితాలు, చీకటి బతుకుల్లోని సంకెళ్లను ఛేదించుకుని పోరాటయోధులై మిణుగురుల్లా వెలిగిన అరుదైన స్త్రీల చరిత్ర ఈ పుస్తకం. ఆహ్వానం లక్ష్మి సంస్మరణలో సాహితీ సాంస్కృతిక వేదిక 'భిన్నస్వరాలు' ఈనెల 30న 'మిణుగురులు'పై చర్చావేదికను నిర్వహిస్తున్నారు. స్థానిక కవిరాజ పార్కులో సాయంత్రం జరిగే చర్చలో రచయిత్రి స్వరూపరాణితోపాటు రచయితలు ఉషా. ఎస్.డాని, వేంపల్లి షరీఫ్, మందరపు హైమావతి, పిల్లి వాసు పాల్గొంటారు.

■ చరిత్రలో స్త్రీల, అందునా బలహీనవర్గాల స్త్రీల పాత్రను అగ్రవర్ణ చరిత్రకారులు ఉద్దేశపూర్వకంగా నమోదు చేయలేదంటారు. కాలక్రమంలోని సామాజిక/ సంస్కరణోద్యమాలతో ఆ చరిత్రను అణచివేతకు గురైన స్త్రీలే తిరగరాస్తున్నారు. దళితులు, మైనారిటీలు, ఆదివాసీల జాతులు, వారి చరిత్రపై వివక్షను ఎత్తిపడుతూ సరికొత్త చరిత్రను వెలుగులోకి తెస్తున్నారు. అంబేడ్కర్ మార్గదర్శిగా చరిత్రకు కొత్త వాకిళ్లు తెరుస్తున్నారు. ఈ క్రమంలో వస్తున్న కొందరి రక్తాక్షర చరిత్రలే ఈ మిణుగురులు. వీరిలో చాలామందిని విని ఉండం. ఏ వేదికలపైనా వీళ్ల ప్రస్తావన కనిపించదు.

■ ఎదమీద కొంగును కప్పుకోనివ్వనందుకు నిరసనగా రొమ్ములనే కోసుకుని ప్రాణత్యాగం చేసిన నంగేళీ, యుద్ధరంగంలోంచి వెళ్లిపోయిన ఝాన్సీలక్ష్మీబాయి స్థానంలో పోరాడి ప్రాణాలు కోల్పోయిన ఝల్కారిబాయి కోరీ, పూలే దంపతుల ఉద్యమ సహచరి ఫాతిమా షేక్, వైద్యవృత్తిలో ప్రావీణ్యంతో అన్ని కులాల్లో శిష్యులను తీర్చిదిద్దిన జ్యోతి లింగమ్మ, అవిటితనాన్ని చదువుతో జయించిన పుల్లగూర దీనమ్మ, పార్లమెంట్‌కు ఎన్నికై అంటరానితనాన్ని చట్టవ్యతిరేక చర్యగా రాజ్యాంగంలో చేర్చాలంటూ రాజ్యాంగసభ ఎదుట తీర్మానాన్ని ప్రవేశపెట్టిన దాక్షాయణీ వేలాయుధన్, బుర్రకథ పితామహుడు నాజర్‌కే బుర్రకథ నేర్పిన వేము సువార్తమ్మ సహా పలువురు పోరాటయోధులు కత్తి చల్లమ్మ, కామ్రేడ్ కమల, సావిత్రీబాయి రోడే, రమాబాయి అంబేడ్కర్, హేతువాద లక్ష్మి వంటి 26 మంది ఇందులో కనిపిస్తారు. 'మిణుగురులు చీకట్లో మెరుస్తాయి. రాత్రిపూట వెలుతురు దరిచేరని ఆదివాసీ సమూహాలకు ఈ మిణుగురులే తోవ చూపుతాయి. పుస్తకరూపంలో వస్తున్న ఈ మిణుగురులూ అంతే...చీకటి బతుకువాడల్లో తోవ చూపు దిక్సూచులు' అంటారు అరుణాంక్ లత.

■ ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి స్వస్థలం తెనాలి సమీపంలోని అమృతలూరు మండల గ్రామం ప్యాపర్రు. తల్లిదండ్రులు మంత్రయ్య, మరియమ్మ. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో పీజీ తర్వాత హైదరాబాద్ సెంట్రల్ స్కూల్‌లో ఎంఫిల్, పీహెచ్‌డీ చేశారు. పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం శ్రీశైలంలో చరిత్ర, సంస్కృతి, పురావస్తుశాస్త్ర విభాగంలో తొమ్మిదేళ్లు అసిస్టెంటు ప్రొఫెసర్‌గా, విభాగాధిపతిగా చేశారు. ప్రస్తుతం నాగార్జున యూనివర్సిటీలో బుద్ధిస్ట్ స్టడీస్ ప్రొఫెసర్‌గా, హెడ్‌గా, హ్యూమానిటీస్, ఎడ్యుకేషన్ స్కూల్స్‌కి డీన్‌గా, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్నారు. వివిధ కాలేజీలు, యూనివర్సిటీలకు బోర్డ్ ఆఫ్ స్టడీస్ సభ్యురాలు/సలహాదారుగా పనిచేస్తున్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పాలకమండలి సభ్యురాలిగా ఇటీవలే నామినేట్ అయ్యారు.

■ ఆర్కియాలజీ, సామాజిక, సాంస్కృతిక చరిత్ర, ఎథ్నో ఆర్కియాలజీ, జెండర్ స్టడీస్, రెలిజియస్ స్టడీస్‌లు స్వరూపరాణి పరిశోధనా రంగాలు. మూడు కవితా సంపుటాలు వెలువరించారు. ఇందులో ఒకటి ఇంగ్లిష్. 'మంకెనపువ్వు' కవితా సంపుటి తెలుగు కవిత్వంలో మంచి గుర్తింపును పొందటమే కాదు.. స్వరూపరాణిని ఆధునిక కాలంలో తొలి దళిత కవయిత్రిగా సాహిత్య విమర్శకులు గుర్తించారు. ఈ పుస్తకంలోని కవితలు వివిధ భాషల్లోకి అనువాదమయ్యాయి. రెండు వ్యాస సంపుటాలు, అయిదు సిద్ధాంత గ్రంథాలు ప్రచురించారు. వీరి రచనలు ఇంటర్ నుంచి పీజీ వరకు అనేక విశ్వవిద్యాలయాల్లో పాఠ్యాంశాలుగా ఉన్నాయి. వృత్తి, వ్యావృత్తుల్లో భాగంగా వందలాది రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ సమావేశాల్లో ప్రసంగాలు చేశారు. వందకు పైగా పరిశోధనా పత్రాలు సమర్పించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బెస్ట్ రీసెర్చర్ అవార్డును ఇచ్చారు. వీరి వద్ద 50 మంది పరిశోధక విద్యార్థులు పీహెచ్‌డీ చేశారు. వీరిలో పలువురు బర్మా, థాయ్‌లాండ్, వియత్నాం, భూటాన్‌కు చెందిన వారు. తన కృషికి గుర్తింపుగా 13 అవార్డులు స్వీకరించారు.

వైభవంగా అయ్యప్ప స్వామి పడిపూజ



తెనాలిటౌన్: పట్టణ శివాజీచౌక్ సెంటర్‌లో అయ్యప్పస్వామి పడిపూజ మహోత్సవం బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. పలువురు గురుస్వాముల ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి వారికి మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక రమేష్ దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, పుష్ప దంపతులు పాల్గొని పూజలు చేశారు. తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

విజయ్‌కాంత్ మృతికి సంతాపం

తెనాలిరూరల్: ప్రముఖ తమిళ సినీ నటుడు, రాజకీయ నాయకుడు 'కెప్టెన్' విజయ్‌కాంత్‌కు మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్(ఏపీ) సంతాపం వ్యక్తం చేసింది. స్థానిక పెదరావూరులో సినీ దర్శకుడు, మా–ఏపీ వ్యవస్థాపకుడు దిలీప్‌రాజా గురువారం విలేకరులతో మాట్లాడారు. సినిమాల్లో రాణిస్తూ, సొంతంగా రాజకీయ పార్టీ పెట్టి ప్రజలకు విజయ్‌కాంత్ అందించిన సేవలు మరువలేనివన్నారు. విజయ్‌కాంత్ మృతికి సంతాపంగా మౌనం పాటించారు. మిలటరీ ప్రసాద్, అమీర్‌చౌధురి, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

బీసీ నాయకుడు శేషంరాజుకు ఘననివాళి



తెనాలిటౌన్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ నాయకుడు తంగెళ్ళ శేషంరాజు వర్ధంతి గురువారం రామలింగేశ్వరపేటలోని శ్రీ సత్యసాయి బాబా మందిరంలో జరిగింది. అక్కడ ఉన్న శేషంరాజు విగ్రహానికి బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, గుర్రపు ద్వారక శ్రీనులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ శేషంరాజుతో తమకు ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు. శేషంరాజు కుటుంబ సభ్యులు సుందరమ్మ, అనురాధ, సత్యనారాయణ రాజు, కొండం రాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

తెనాలిఅర్బన్: మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్రవ్యాప్త సమ్మె గురువారంతో మూడో రోజుకు చేరింది. పారిశుద్ధ్య కార్మికులు మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు.

హోరాహోరీగా 'ఆడుదాం ఆంధ్రా'


తెనాలిలో క్రికెట్ ఆడుతున్న మహిళలు


కొల్లిపరలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న తహసీల్దార్ నాంచారయ్య, ఎంపీడీఓ విజయలక్ష్మి


తెనాలిలో మహిళలకు వాలీబాల్ పోటీలు

తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం తెనాలి పట్టణంలో ఉత్సాహంగా సాగుతుంది. యువతి యువకులు, మహిళలు వాలీబాల్, క్రికెట్, ఖోఖో, బ్యాడ్మింటన్ వంటి ఆటల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. తెనాలి పట్టణంలోని 20 క్రీడా మైదానాల్లో గురువారం వివిధ రకాల పోటీలు జరిగాయి. సచివాలయ ఉద్యోగులు, కార్యక్రమ నోడల్ అధికారులు పోటీలను పర్యవేక్షించారు.

కొల్లిపరలో...

కొల్లిపర: మండలంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు మూడో రోజు గురువారం ఉత్సాహంగా కొనసాగాయి. మండలంలో 15 సచివాలయాల పరిధిలో ఖోఖో, బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలు నిర్వహించారు. మండల కేంద్రమైన కొల్లిపర గ్రామ సచివాలయం పరిధిలో క్రికెట్ పోటీలను తహసీల్దార్ జి.నాంచారయ్య, ఎంపీడీఓ వి.విజయలక్ష్మి ప్రారంభించి, కొంత సమయం క్రికెట్ ఆడి యువతను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు సాల్మన్‌ఖాన్, ఝాన్సీలత, ఏఓ చంద్రమోహన్, భీమవరపు మధుసూదనరెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.


తెనాలిలో ఖోఖో ఆడుతున్న మహిళలు, బాలికలు

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడమే ధ్యేయం


టాస్ వేసి పోటీలు ప్రారంభిస్తున్న జేసీ రాజకుమారి

జాయింట్ కలెక్టర్ రాజకుమారి

ఫిరంగిపురం: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడమే ప్రభుత్వ ధ్యేయంగా ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మార్నింగ్‌స్టార్ కళాశాలలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను గురువారం పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను టాస్‌వేసి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 1,43,039 మంది క్రీడాకారులు ఆడుదాం ఆంధ్రా కోసం పేర్లు నమోదు చేసుకున్నారని చెప్పారు. వాటిలో 567 సచివాలయాలకు గాను ఐదు క్రీడలకు గాను 13వేల 174టీంలుగా ఏర్పాటు చేశామన్నారు. వారితో 229 గ్రౌండ్‌లలో క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వారికి అవసరమైన 22వేల 453క్రీడాపరికరాలు , కిట్లు, మెడల్స్, ట్రోఫీలు, సర్టిఫికెట్లు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ఆమె వెంట మండల ప్రత్యేకాధికారి ఎం.వెంకటరామిరెడ్డి, తహసీల్దార్ పద్మనాభుడు ఉన్నారు.


గ్రంథాలయాధికారులకు పుస్తకాలు అందజేస్తున్న జేసీ రాజకుమారి

గ్రంథాలయానికి పుస్తకాలు అందజేత

తాడికొండ: తాడికొండ, పొన్నెకల్లు శాఖా గ్రంథాలయాలకు గ్రూప్–1, గ్రూప్–2 పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు పుస్తకాలను గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్, జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జి జి.రాజకుమారి అందజేశారు. ఆన్ డిమాండ్ పద్ధతిలో కొనుగోలు చేసిన ఈ పుస్తకాలను విద్యార్థులకు ఆయా గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచే విధంగా చర్యలు తీసుకున్నట్లు గ్రంథాయాధికారి జి.శ్రీనివాసరావు తెలిపారు.

తాడేపల్లిరూరల్: మంగళగిరి శాఖా గ్రంథాలయానికి జేసీ రాజకుమారి గురువారం గ్రూప్–2 పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కందుల ఝాన్సీ లక్ష్మీతో కలసి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో మంగళగిరి శాఖ గ్రంథాలయానికి గ్రూప్–2 పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను అందజేశామని, సన్నద్ధమయ్యే అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ఆన్‌లైన్‌లో షేర్‌లు కొని మోసపోయిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. బ్రాడీపేటలో నివాసం ఉండే కె.వి.సత్యనారాయణ ఆన్‌లైన్‌లో తొలుత రూ. 10వేలు పెట్టుబడి షేర్ కొని లాభం పొందాడు. దీంతో సత్యనారాయణ ఐఆర్ఈఏడీ వెబ్‌సైట్‌లో విడతల వారీగా రూ. 53 లక్షలు పెట్టుబడి పెట్టాడు. మొత్తం రూ. 1.25 కోట్ల లాభం వచ్చినట్లు చూపించింది. అయితే డబ్బు విత్‌డ్రా చేయబోతే రాలేదు. దీంతో సత్యనారాయణ వెబ్‌సైట్ నిర్వాహకుల్ని సంప్రదిస్తే ఎలాంటి సమాధానం లేదు. మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

ఆగంతకుడు మహిళ మెడలో బంగారు గొలుసు తెచుకుని పరారైన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పండరీపురం 6వ లైనులో నివసించే పి.పద్మావతి గురువారం నడుచుకుంటూ వెళుతోంది. ఈ సమయంలో గుర్తు తెలియని వ్యక్తి హెల్మెట్ పెట్టుకుని ద్విచక్రవాహనంపై వచ్చి ఆమె మెడలోని 25 గ్రాముల బంగారు గొలుసు తెంచుకుని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు సమకాలీన సాంఘిక పద్యనాటకాలపై సదస్సు


బ్రోచర్ ఆవిష్కరించిన డాక్టర్ సాయిమాధవ్ బుర్రా

తెనాలి: కళల కాణాచి–తెనాలి, వేదగంగోత్రి ఫౌండేషన్–విజయవాడ సంయుక్తంగా ఈనెల 30వ తేదీన తెనాలిలో సమకాలీన సాంఘిక పద్యనాటకరచన, సాంఘిక నాటక రచనలపై రచయితలకు సదస్సును నిర్వహించనున్నారు. కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఉదయం 9 గంటలకు ఆరంభమయ్యే సదస్సు బ్రోచర్‌ను గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో కళల కాణాచి వ్యవస్థాపకుడు, ప్రముఖ సినీరచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా ఆవిష్కరించి, వివరాలను తెలియజేశారు. తెలుగు భాషకే సొంతమైన పద్యం వినమరుగవుతూ ఉందని, యువత పద్యానికి దూరమవటం ఇందుకు కారణమని సాయిమాధవ్ అభిప్రాయపడ్డారు. పౌరాణిక/చారిత్రక నాటకాలకే పరిమితమైన పద్యంతో సాంఘిక నాటకాలను తీసుకురావాలని, ఇందుకోసం 2024లో సమకాలీన సాంఘిక పద్యనాటక పోటీలను నిర్వహిస్తామని తమ రెండు సంస్థలు ప్రకటించినట్టు గుర్తుచేశారు. పోటీలకు ఎంపికైన ప్రతి నాటిక రచనకు ప్రత్యేకంగా రూ.25వేల పారితోషికాన్ని ఇవ్వనున్నట్టు చెప్పారు. ఈ నేపథ్యంలో పద్యనాటకాలు, వాటిలో అవసరమైన మార్పులు, సాంఘిక పద్యనాటకాలు సమకాలీనతను సంతరించుకోవటం, యువతను పద్యంవైపు నడిపించటానికి చర్చ జరగాలనే భావనతో రచయితలకు సదస్సును నిర్వహిస్తున్నట్టు వివరించారు. డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, చెరుకుమల్లి సింగారావు, వెనిగళ్ల నారాయణ శివప్రసాద్, కొండముది రమేష్‌బాబు, గోళ్ల సుబ్రహ్మణ్యం, దేవరపల్లి భవాని, బడుగు మోహనరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన


మహిళా రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏపీఎం విజయభారతి

మేడికొండూరు: మండలంలోని సిరిపురం గ్రామంలో రైతు సాధికార సంస్థ సెర్ప్ యాజమాన్యం ఒప్పందంలో భాగంగా ప్రకృతి వ్యవసాయ పంటలపై మహిళ రైతులకు అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఏపీఎం విజయభారతి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వలన సాగు చేసిన పంటల ద్వారా మంచి ఆరోగ్యం వస్తుందన్నారు. సభ్యులు అంతర పంటల సాగుపై రైతులకు ఆర్థికాభివృద్ధి చేకూరుతోందన్నారు. కార్యక్రమంలో టీసీలు షేక్ కరీముల్లా, వి.మల్లేశ్వరరావు, కరుణమ్మ, ఎంఎస్ఓటీలు, వీఓఏలు, వరప్రసాద్, యూనిట్ ఇన్‌చార్జి లక్ష్మి పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిపై అప్రమత్తత అవసరం



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని పలు గ్రామాల్లో కుష్ఠు వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా దుగ్గిరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు అబ్దుల్ రహమాన్ మాట్లాడుతూ జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలనా పక్షోత్సవాలను ఈనెల 27వ తేదీ నుంచి జనవరి 12 వరకు నిర్వహిస్తున్నామని తెలిపారు. దీనిలో భాగంగా ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని చేపట్టామని దుగ్గిరాల మండల పరిధిలోని 18 గ్రామాల్లో ఈ సర్వే జరుగుతుందని అన్నారు. చర్మంపై స్పర్శలేని మచ్చలు, చెవులపై, వీపుపై, నొప్పిలేని బొడిపలు, కనుబొమ్మలు మరియు కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం, ముక్కు దిబ్బడ, ముక్కులో నుంచి రక్తం కారడం, కాళ్లు, చేతులు తిమ్మిర్లు లేక జోములు కలిగి ఉండడం, చల్లని లేదా వేడి వస్తువులను గుర్తించలేకపోవడం , చేతుల నుంచి వస్తువులు జారిపోవడం తదితర లక్షణాలు ఉన్న ఎడల వెంటనే ఆరోగ్య కార్యకర్తలను సంప్రదించాలని వివరించామని తెలిపారు.